క్లుప్తంగా

అగ్ని ప్రమాదాలపై మహిళలకు అవగాహన



గ్యాస్ ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తాడిపత్రి రూరల్: పట్టణంలోని గోకుల్ అపార్ట్‌మెంట్, కొత్త షిర్డీ సాయి దేవాలయం, సంజీవనగర్ తదితర ప్రాంతాల్లో నివశించే మహిళలకు బుధవారం ఫైర్ ఆఫీసర్ మోహన్‌బాబు ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగినపుడు, లిఫ్ట్ పనిచేయనపుడు తీసుకోవాల్సి జాగ్రత్తలు, ఎల్‌పీజీ గ్యాస్ ఉపయోగించే సమయంలో జరిగే ప్రమాదాలపై తీసుకోవాల్సిన జగ్రత్తలపై ప్రయోగాత్మకంగా చేసి చూపించారు.

గుంతకల్లు: అవగాహనతో అగ్ని ప్రమాదాలకు అడ్డుకట్టు వేయొచ్చని అగ్నిమాపక శాఖ జిల్లా సహాయాధికారి ఎస్.అశ్వర్థ పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఆయన పట్టణంలోని ఎస్‌ఎల్‌వీ థియేటర్ సమీపంలో షాపుల యాజమానులకు, సిబ్బందికి, ప్రజలకు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఇళ్లలో ఐఎస్‌ఐ మార్కు ఉన్న ఎలక్ట్రికల్ వైర్లను మాత్రమే ఉపయోగించాలన్నారు. గ్యాస్ ప్రమాదాల జరిగితే తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగిన సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న సూపర్‌వైజర్లు

తాడిపత్రి రూరల్: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం రెండో రోజూ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు సంబంధించిన సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగింది. తాడిపత్రి పట్టణంతో పాటు పరిసర మండలాల్లోని పలువురు టీచర్లు, ఆయాల సర్టిఫికెట్లను సూపర్‌వైజర్లు పరిశీలించారు.

సీఎస్‌డీటీపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

గుంతకల్లు రూరల్: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న గుంతకల్లు సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మి పై చర్యలు తీసుకోవాలని ధర్మహ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు బుధవారం మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసి ఫిర్యాదు చేశాడు. గుంతకల్లు మండలంలో ఎండీయూ వాహనాలు మూలన పెట్టి రేషన్ షాపులోనే రేషన్ పంపిణీ చేస్తూ తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారన్నారు. డీఎస్‌ఓ నేరుగా గ్రామానికి వచ్చి పరిశీలించి ఎండీయూ వాహనం ద్వారా రేషన్ పంపిణీ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సీఎస్‌డీటీని ఆదేశించిన ఆమె పట్టించుకోకపోవడం లేదని ఫిర్యాదు చేశారు.

ఘనంగా కాశిరెడ్డి నాయన ఆలయ ప్రారంభం



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: పాతకొత్తచెరువు గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన కాశిరెడ్డి నాయన ఆలయాన్ని బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాదిలింగేశ్వరబాబు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ బీవీ మాధవి తదితరులు హాజరై పూజలు నిర్వహించారు.

విద్యార్థినికి అభినందనలు



విద్యార్థినిని అభినందిస్తున్న అధ్యాపక బృందం

గుంతకల్లు రూరల్: తిమ్మాపురం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని కథల పోటీల్లో జాతీయ స్థాయిలో ప్రోత్సాహక బహుమతి గెలుచుకుంది. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జ్యోత్స్న మాచిరాజు బాల సాహిత్యపీఠం హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల కథల పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరచింది. జాతీయ స్థాయి కథల పోటీలకు ఎంపికైన విద్యార్థిని 'వరించిన అదృష్టం' అనే కథను మరో 541 మంది విద్యార్థులతో కలిసి జాతీయ స్థాయి కథల పోటీలకు తన కథను పంపింది. పోటీల్లో ఈ కథ ప్రోత్సాహక బహుమతికి ఎంపిక కావడంతో బుధవారం పాఠశాల హెచ్‌ఎం నారాయణ రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

మన్నించు చెన్నకేశవా!

లక్ష్మీచెన్నకేశవస్వామికి ఎలుకల బెడద

- దుమ్ము, ధూళితో నిండిన మూలవిరాట్
- లోపించిన దేవదాయశాఖ పర్యవేక్షణ
- అపరిశుభ్రంగా ఆలయ అవరణ



ఉప ఆలయానికి తాళం వేసిన దృశ్యం





చింతల వేంకటరమణస్వామి ఆలయం, చెన్నకేశవస్వామి మూలవిరాట్ కింది భాగంలో ఎలుక

తాడిపత్రి, రూరల్: పట్టణంలోని ప్రసిద్ధ వైష్ణవ క్షేత్రమైన చింతల వేంకటరమణస్వామి ఆలయ అవరణలో ఉప ఆలయంగా ఉన్న లక్ష్మీసమేత చెన్నకేశవ స్వామి ఆలయానికి ఆలనాపాలనా కరువైంది. ఆలయంలోని మూలవిరాట్ పరిసర ప్రాంతాల్లో ఎలుక సంచారం ఎక్కువగా ఉండటంతో స్వామికి అపచారం జరిగినట్లు భక్తులు భావిస్తున్నారు. ఎలుకల బెడద వల్ల గర్భాలయంలో కొంత వరకు దుర్వాసన వస్తున్నట్లు వారు పేర్కొంటున్నారు. దేవదాయశాఖ పర్యవేక్షణ కొరవడటంతో ఈ దుస్థితి నెలకొన్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నామమాత్రంగా పూజలు..

ఆలయంలో నామమాత్రపు పూజలతో మమ అనిపిస్తున్నారు. నిత్య దీపారాధన కూడా సరిగా జరగడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అమ్మవారి సమేతంగా ఉన్న చెన్నకేశవస్వామి మూలవిరాట్ దుమ్ము, ధూళితో ఉంటోంది. ఆలయానికి ఎప్పుడూ తాళం వేసే ఉంటున్నారు. ఆలయం ముందుభాగం సైతం అపరిశుభ్రంగా తయారైంది. ఆలయ పరిశుభ్రతను అధికారులు పట్టించుకోవడం లేదు. పట్టణంలోని అనేక మంది భక్తులకు లక్ష్మీచెన్నకేశవస్వామి ఇంటి ఇలవేల్పుగా ఉన్నాడు. దీంతో వారంతా తరచూ ఇక్కడికి వచ్చి దర్శనం చేసుకుంటుంటారు.

ఆలయాన్ని సందర్శిస్తున్న టూరిస్టులు

దేవాలయం శిల్ప కళా సౌందర్యంతో అలరారుతోంది. రాయలసీమలోని శిల్ప కళ సంపద ఉన్న ఆలయాల్లో ముందు వరుసలో ఉంది. ఆలయంలో రామయాణ, మహాభారత గాథలకు సంబంధించిన శిల్ప సౌందర్యం అబ్బుర పరుస్తోంది. ఆలయ శిల్ప సౌందర్యాన్ని తిలకించేందుకు ఎందరో టూరిస్టులు వస్తుంటారు. గతంలో ప్రత్యేకంగా తాడిపత్రి ఆలయాలకు టూరిస్టు స్పాట్‌గా ఉన్నతాధికారులు గుర్తించారు. విదేశీయులు సైతం అప్పుడప్పుడు ఆలయాన్ని సందర్శించి పరవశించిపోతుంటారు. ఇంతటి ప్రశస్తమైన ఆలయలంలో ఎలుకల బెడద ప[illegible]యి.

భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయి



లక్ష్మీచింతల వెంకటరమణస్వామి ఆలయంలో ఉన్న లక్ష్మీసమేత చెన్నకేశవ ఆలయంలో ఎలుకలు తిరుగుతుండటంతో భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయి. స్వామి వారి మూలవిరాట్ దుమ్ము, ధూళితో కనిపిస్తోంది. స్వామి వారికి నిత్య పూజలు జరగడం లేదు.

– కుమారస్వామి, భక్తుడు

చర్యలు తీసుకుంటాం



లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో ఎలుకల బెడదపై విచారణ జరిపిస్తాం. స్వామికి నిత్య పూజలు ఎందుకు జరగలేదో ఆరా తీస్తాం. బాధ్యులైన వారిపై చర్యలు తప్పవు. దేవదాయశాఖ తరపున స్వీపర్‌ను ఏర్పాటు చేశారు. పురావస్తు శాఖ పరిధిలో ఒక వాచ్‌మెట్ ఇద్దరు స్వీపర్లు పనిచేస్తున్నారు. పది రోజులుగా వారు సమ్మెలో ఉన్నారు.

– రామాంజనేయులు, ఈఓ

ఫీజు బకాయిలను విడుదల చేయాలి



మాట్లాడుతున్న చంద్రశేఖర్ యాదవ్

గుంతకల్లుటౌన్: రాష్ట్రంలో డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ ఇతర కోర్సులు చదువుతున్న విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంశీ యాదవ్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. పేద విద్యార్థులను ఉన్నత చదువులకు దూరం చేయాలన్నదే కూటమి సర్కారు లక్ష్యంగా పెట్టుకుందని వారు విమర్శించారు. మాజీ సీఎం వైఎస్.జగన్ పిలుపు మేరకు తమ పార్టీ చేపట్టిన ఫీజు పోరు కార్యక్రమంతో ప్రభుత్వం రూ.1,300 కోట్ల బకాయిలిచ్చిందన్నారు. మిగిలిన రూ.2,600 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఫీజుల పేరిట విద్యార్థులను ఆయా కాలేజీల యాజమాన్యాలు వేధిస్తుంటే విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ నిద్రపోతున్నారా అని వారు ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలన్నింటినీ జమచేయాలని, విద్యార్థులను వేధిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో దశలవారీగా ఉద్యమాలు చేపడుతామని వారు హెచ్చరించారు. వైఎస్సార్ విద్యార్థి విభాగం నియోజకవర్గం అధ్యక్షుడు నారప్ప, పట్టణ నాయకులు మణి, శాంతూ, గణేష్, జయరెడ్డి, ఫయాజ్, ప్రదీప్, విష్ణు, సాయి యాదవ్ పాల్గొన్నారు.

తహసీల్దార్ లేకుండా సమావేశం పెట్టొద్దు

- అధికారులపై జెడ్పీటీసీ మండిపాటు



భూ సమస్యలపై డిప్యూటీ తహసీల్దార్‌ను ప్రశ్నిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ, నాయకులు

యల్లనూరు: మండలంలో భూ సమస్యలు అధికంగా ఉన్నాయని, తహసీల్దార్ లేకుండా మండల సర్వసభ్య సమావేశం పెట్టొద్దని భోగతి ప్రతాప్‌రెడ్డి అధికారులపై ధ్వజమెత్తారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గంగాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. వెలుగు ఏపీఎం, ట్రాన్స్‌కో ఏఈ తమ సిబ్బందిని పంపించగా అటవీ, ఇరిగేషన్, మత్స్య శాఖ అధికారులు, తిమ్మంపల్లి వైద్యులు గైర్హాజరయ్యారు. రెవెన్యూ అధికారులు రైతులకు అందుబాటులో ఉండటం లేదని డిప్యూటీ తహసీల్దార్ మునీంద్రను జెడ్పీటీసీ ప్రశ్నించారు. కస్తూర్బా విద్యాలయం నుంచి కృష్ణాపురం మీదుగా వెన్నపూసపల్లికి రోడ్డు సౌకర్యం కల్పించాలని సభ్యులు అడిగారు. వైస్ ఎంపీపీ–2 రమాదేవి, ఎంపీడీఓ వాసుదేవరెడ్డి, ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ నందిని, ఎంపీటీసీలు తిమోతి, సిద్ధమ్మ, సర్పంచులు ప్రభాకర్‌రెడ్డి, పెద్దనాగరాజు, గంగరాజు, ఎంఈఓ చంద్రశేఖర్, వెటర్నరీ డాక్టర్ సువర్ణ, ఏఓ రామకృష్ణ, వైద్యులు లోకేష్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుప్రజ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజామణి, హౌసింగ్ ఏఈ సుప్రజ, ఇన్‌చార్జ్ ఏపీఓ సత్యమూర్తి, ఈఓఆర్డీ మనోహర్‌బాబు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో క్రికెట్ బుకీలు?

తాడిపత్రిటౌన్: పట్టణానికి చెందిన ఐదుగురు క్రికెట్ బుకీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు పట్టణంలో తీవ్ర చర్చ జరుగుతోంది. నాలుగు రోజుల క్రితం పట్టణ శివారులోని బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయ సమీపంలో మొదటగా పట్టణానికి చెందిన ఓ ఎలక్ట్రికల్ స్కూటర్ డీలర్‌ను క్రికెట్ బుకీగా గుర్తించి అతన్ని ఎస్పీ స్పెషల్ టీం పోలీసులు అదుపులోకి తీసుకొని అనంతపురం తరలించి విచారిస్తున్నట్లు తెలిసింది. అతని సమాచారంతో పట్టణానికి చెందిన మరో నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అయితే బుకీల బ్యాంకు ఖాతాలను పరిశీలించగా రూ.80 లక్షల దాకా లావాదేవీలు జరిపినట్లుగా గుర్తించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో పట్టణంలో ఇంకా ఎంత మంది క్రికెట్ బుకీలు, బెట్టింగ్‌రాయుళ్లు ఉన్నారన్న కోణంలో విచారణ ప్రారంభించినట్లు సమాచారం. విషయం బయటకు పొక్కడంతో తాడిపత్రిలో క్రికెట్ బెట్టింగ్‌రాయుళ్లలో ఆందోళన మొదలై కొంత మంది ఏకంగా పట్టణం వదిలి పారిపోతున్నట్లు తెలిసింది. ఈ విషయంపై సీఐ సాయిప్రసాద్‌ను వివరణ కోరగా తనకేమీ తెలియదంటూ సమధానం ఇచ్చారు.

భూసార పరీక్షలపై అవగాహన



భూసార పరీక్షా పత్రాలను చూపుతున్న వ్యవసాయ అధికారులు, సిబ్బంది

పుట్లూరు: అరకటివేముల గ్రామంలో బుధవారం భూసార పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సేవ కేంద్రంలో ఎస్‌టీఎల్ నుంచి వచ్చిన వ్యవసాయ అధికారి శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి మూడేళ్లకోసారి తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. వి ఆకారంలో గుంతలను తవ్వి ఎకరాకు మూడు నుంచి నాలుగు చోట్ల మట్టి నమూనాలను సేకరించి వాటిని బాగా కలపడంతో పాటు ఎదురెదురుగా భాగాలను తీసి 500 గ్రాముల మట్టిని ల్యాబ్‌కు పంపాలన్నారు. భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులను వాడటం వల్ల పెట్టుబడి భారం తగ్గుతుందని వివరించారు. అనంతరం భూసార పరీక్షా పత్రాలను అందజేశారు. ఏఓ కాత్యాయని, ఏఈఓ హరి, సిబ్బంది పాల్గొన్నారు.

పీర్లచావిడి తాళం ఇవ్వలేదని దాడి

యల్లనూరు: బొప్పేపల్లిలో పీర్లచావిడి తాళం విషయంలో జరిగిన దాడిలో ఒకరికి గాయాలయ్యాయి. సీఐ సత్యబాబు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మహబూబ్‌బాషా పీర్లచావిడి తాళం చెవి తన వద్ద పెట్టుకున్నాడు. అదే గ్రామానికి చెందిన చాంద్‌బాషా పిల్లలు వెళ్లి తాళం చెవి ఇవ్వాలని మహబూబ్‌బాషాను అడిగారు. అందులో విలువైన వస్తువులున్నాయని తాళం ఇచ్చేందుకు నిరాకరించాడు. ఈ విషయంలో చాంద్‌బాషా, మహబూబ్‌బాషా గొడవకు దిగారు. మహబూబ్‌బాషా మరోఇద్దరు కలిసి చాంద్‌బాషాపై దాడి చేయగా తలకు తీవ్ర గాయమైంది. బాధితుడిని వెంటనే తాడిపత్రి అసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మహబూబ్‌బాషాతో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బాధితులకు ఆర్థికసాయం

శింగనమల: గురుగుంట్ల గ్రామానికి చెందిన శివలక్ష్మి, కృష్ణారెడ్డి ప్రమాదశాత్తు గాయపడడంతో వైద్య ఖర్చుల కోసం వైఎస్సార్‌సీపీ నేత వెంకటరమణ బుధవారం ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. చిన్నారి శివలక్ష్మి వంట నూనె పడి గాయపడింది. కృష్ణారెడ్డి ప్రమాదవశాత్తు కిందపడి కాలికి గాయకావడంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సావిత్రి తదితరులు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి కోరారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఘోరంగా విఫలమైందన్నారు. సీఎం చంద్రబాబు ఎన్నికల హామీలను ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. తాగునీటి సమస్యతో ప్రజలు ఖాళీ బిందెలతో రోడ్లు ఎక్కుతున్నారన్నారు. కనీసం పేదలకు గుక్కెడు నీళ్లు కూడా ఇవ్వ లేనిస్థితిలో ప్రభుత్వం ఉండడం దారుణమన్నారు. అనంతరం ఇందిరమ్మ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ పుణ్యవతి, ఎంపీడీఓ సాల్మాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఐద్వా జిల్లా నేత అశ్విని, మండల కార్యదర్శి మునీజ, గౌరవాధ్యక్షురాలు నాగమ్మ, అంకమ్మ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంకష్టహర చతుర్థి

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయంలో బుధవారం రాత్రి సంకష్టహర చతుర్థి పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు దేవగుడి రామేశ్వరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు చంద్రాశర్మ, అనిల్ కుమార్ విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. మహా మంగళహారతి అనంతరం భక్తాదులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

21 మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

గార్లదిన్నె: స్థానిక మోడల్ స్కూల్లో ఈనెల 21న ఆరో తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సతీష్ తెలిపారు. బుధవారం స్కూల్లో ప్రవేశ పరీక్షపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రవేశ పరీక్ష ఓఎంఆర్ షీట్ ద్వారా ఉంటుందని, పరీక్షలో వచ్చిన మార్కులు ఆధారంగా సీటు కేటాయిస్తామన్నారు. విద్యార్థి హాల్ టికెట్‌లో ఫొటో రాకపోతే, విద్యార్థి ఫొటో అతికించి, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల హెచ్‌ఎంతో సంతకం చేయించుకురావాలన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

పామిడి: పౌష్టికాహారంతో ఆరోగ్యం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రామలక్ష్మమ్మ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మంజుటాకీస్, ఆర్టీసీ బస్టాండ్ అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన పోషక పక్షోత్సవాలకు ఆమె హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె పౌష్టికాహార ప్రాముఖ్యతను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు జయంతీ, షేకున్‌బీ, ఆయాలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

రాయలచెరువును చెత్తరహితంగా మారుద్దాం



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ విజయలక్ష్మి

యాడికి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా రాయలచెరువును చెత్తరహితంగా మారుద్దామని డీఎల్‌డీఓ విజయలక్ష్మి సిబ్బందికి సూచించారు. బుధవారం రాయలచెరువులోని సచివాలయాలను ఎంపీడీఓ వీర్రాజుతో కలిసి డీఎల్‌డీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాయల పరిధిలో సర్వేలు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ప్రతినెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కార్యాలయ పరిసరాలను శుభ్రం చేయించుకోవాలన్నారు. అనంతరం గ్రామ సమీపంలో ఉన్న డంపింగ్ యార్డును పరిశీలించారు. ఈసందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. పంచాయతీ కార్యదర్శి అరుణ్ కుమార్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఇంట్లో చోరీ

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని తోళ్ల షాపు కాలనీలో బుధవారం తాళం వేసిన ఇంటిలో చోరీ జరిగింది. వివరాల్లోలు.. తోళ్ల షాపు కాలనీలో నివాసముండే గోవిందు, సుగుణమ్మ దంపతులు ఇంటికి తాళం వేసి పని మీద వేరే ఊరికి వెళ్లారు. అయితే తిరిగి వచ్చే చూసే సరికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. అనుమానం వచ్చి లోపలికి వెళ్లి పరిశీలించగా బీరువాలో దాచి ఉంచిన రూ.20 వేలు నగదు, అర తులం బంగారు ఉంగరం కనిపించలేదు. దీంతో చోరీకి గురైనట్లు తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీం సభ్యులు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి ఆధారాలు సేకరించారు.



ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

మురుగు.. రోడ్డుపై పరుగు



రోడ్డుపై నిల్వ ఉన్న మురుగునీరు

గుత్తి: పట్టణంలోని ఉప్పర వీధిలో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం, శానిటరీ వర్కర్లు శుభ్రం చేయకపోవడంతో మురుగునీరంతా ఇళ్లముందు, రోడ్లపై నిల్వ ఉంటోంది. దీంతో పరిసరాలన్నీ దుర్గంధం వెదజల్లుతున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఘనంగా తెలుగు నాటక రంగస్థల దినోత్సవం

పామిడి: పట్టణ స్వరరాగ నాటక కళాసమితి ఉచిత శిక్షణాలయంలో ఆ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం దేవరాజు ఆధ్వర్యంలో బుధవారం తెలుగు నాటక రంగస్థల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కందుకూరి విరేశలింగం పంతులు 177వ జయంతిని పురస్కరించుకొని వేడుకలను జరిపారు. ఈసందర్భంగా సీనియర్ నాటక కళాకారులు పుంజా కృష్ణారావ్‌యాదవ్, బెస్త ఓబులేసును ఘనంగా సత్కరించారు. కళాకారులు బెస్త సుబ్రమణ్యం, నాగార్జున, నారాయణ, చెన్నప్ప, నారాయణరెడ్డి, చితంబరయ్య, పార్థసారథిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీనియర్ కళాకారుడిని సత్కరిస్తున్న దృశ్యం

ప్లాస్టిక్ క్రయవిక్రయాలు నిషేధం



మాట్లాడుతున్న కమిషనర్ జబ్బార్ మియా

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించామని, ఇక మీదట ఎవరైనా ప్లాస్టిక్‌ను విక్రయించినా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం హోటళ్ల నిర్వాహకులు, దుకాణదారులు, అన్ని రకాల వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ప్లాస్టిక్‌ను విక్రయించకూడదన్నారు. ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. జనప నార, పేపర్ సంచులను వాడాలన్నారు. ఇక మీదట ఎవరైనా ప్లాస్టిక్‌ను విక్రయించినా, కొనుగోలు చేసినా మున్సిపల్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జరినా మాతో పాటు కేసులు నమోదు చేయిస్తామన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా, మున్సిపల్ మేనేజర్ రాంబాబు, ఆర్‌ఐ షెక్షావలి, ఆర్‌ఓ సతీష్ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డుపై బుధవారం ఆటో లో నుంచి ప్రమాదవశాత్తు జారి కింద పడి లక్ష్మయ్య అనే వ్యక్తి గాయపడ్డాడు. గుత్తిలోని తురకపల్లి రోడ్డులో నివాసముండే లక్ష్మయ్య పామిడికి వెళ్లడానికి ఆటోలో వెనుక కూర్చున్నాడు. అయితే స్పీడ్ బ్రేకర్ వద్ద ఆటో డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడంతో ఆటో కుదుపునకు గురైంది. వెనుక కూర్చున్న లక్ష్మయ్య జారి కింద పడి గాయపడ్డాడు. స్థానికులు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ధర్నా



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మిక నాయకులు

గుంతకల్లుటౌన్: గత 27 ఏళ్లగా ఔట్‌సోర్సింగ్ పద్ధతిన పని చేస్తున్న మున్సిపల్ ఆప్కాస్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు మున్సిపల్ ఆఫీసు ఎదుట ధర్నా నిర్వహించారు. కార్మికుల వేతన సవరణ బకాయిలు చెల్లించాలని, సీఎఫ్ఎస్ కింద జమచేసిన కార్మికుల సొమ్ము ఎంత ఉందో తెలియజేయాలని, మృతి చెందిన ఆప్కాస్ కార్మికుల కుటుంబసభ్యులకు ఉద్యోగవకాశం కల్పించాలన్నారు. పారిశుధ్య కార్మికులకు పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని కమిషనర్ నయీమ్ అహ్మద్‌కు అందజేశారు. సీఐటీయూ పట్టణాధ్యక్షుడు జగదీష్, నాయకులు రవి, దాసు, రంగనాయకులు, గజేంద్ర, ప్రతాప్, వెంకటేశులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుత్తి రూరల్: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలకు యువత దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 11 నుంచి ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. అర్హులైన ఎస్సీ యువకులు మే 10 లోపు httpr://apobmms.apcfss.in వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు.

రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ

బుక్కరాయసముద్రం: దళిత గిరిజన ప్రజా సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన కొర్రపాడు నాగేంద్ర స్థానిక ప్రభుత్వాస్పత్రిలో బుధవారం రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. శింగనమల నియోజకవర్గంలో దళిత, గిరిజనుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తామన్నారు. నియోజక వర్గంలో అన్ని మండలాల్లో కమిటీలు వేస్తామన్నారు.

గైనకాలజిస్టు బాధ్యతల స్వీకరణ

పామిడి: పట్టణ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బుధవారం గైనకాలజిస్టుగా ఫాతిమా బాధ్యతలు స్వీకరించారు ఆమెకు సీహెచ్‌సీ వైద్యాధికారి జీ శివకార్తీక్‌రెడ్డి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చిలకల రాజగోపాల్, లక్ష్మిదేవి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కమలాధర్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.